క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన జీఆర్‌కే పంత్ రూ. లక్ష 116లు విరాళాన్ని అందించారు. సంబంధిత నగదును సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు పీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌ను అందించారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను బహూకరించారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: అడవివరంలోని విజిని గిరిపాలెంలో కొలువైన ఉమాచంద్రమౌళీశ్వరుని ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో అర్చన చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

ఘనంగా తొలేళ్ల సంబరం

నేడు ఎస్‌ఆర్ పురంలో కనకదుర్గమ్మ పండగ



కనకదుర్గమ్మ

పెందుర్తి: మండలంలోని సౌభాగ్యరాయపురం(ఎస్ ఆర్ పురం)లో కొలువైన కనకదుర్గమ్మ పండగ ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు జరిపారు. శాస్త్రోక్తంగా దేవరను గ్రామంలోకి తీసుకువచ్చి పూజించారు. అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమ పూజలు చేస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మారువారం పండగ సందర్భంగా ఈ నెల 27న అమ్మవారికి భారీ ఎత్తున సారె సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఎనిమిది మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.80 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కుటుంబం అదృశ్యం

లక్కీ డ్రా, చిట్టీలు నిర్వహిస్తూ నష్టాలు

అక్కిరెడ్డిపాలెం: లక్కీ డ్రా, చిట్టీల్లో నష్టాలు, కట్టిన వారి ఒత్తిడి తట్టుకోలేక తండ్రి, భార్య, కుమార్తె అదృశ్యం అయ్యారు. కుటుంబ సభ్యురాలి ఫిర్యాదుపై గాజువాక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. వివరాలు.. జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో అద్దె ఇంట్లో అప్పాగతుల చిన్నారావు, పార్వతి, రేవతి కుటుంబం నివసిస్తోంది. చిన్నారావు లక్కీ డ్రా, చిట్టీలు నిర్వహిస్తున్నాడు. కొద్ది నెలలుగా ఈ వ్యాపారంలో నష్టాలు రావడంతో పాటు, చీటీలు, లక్కీ డ్రాలో డబ్బులు పెట్టిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో చిన్నారావు, పార్వతి, రేవతి ఏప్రిల్ 6న ఇంటి నుంచి వెళ్లి, ఇంకా రాలేదు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెల్లో సౌర కాంతులు

విద్యుత్ తయారీలో సంప్రదాయ ఇంధన వనరుల వినియోగం చాలా ఖర్చుతో కూడుకున్న పని. దీంతోపాటు వీటి నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు పర్యావరణంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు పునరుత్పాదక(రెన్యువబుల్) ఇంధన వనరులపై దృష్టి సారిస్తున్నాయి. ఈ భూమిపై ఎన్నటికీ తరిగిపోని ఇంధన వనరు సౌరశక్తి. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పేరిట సోలార్ రూఫ్‌టాప్ యూనిట్ల ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పరవాడ మండలంలో వీటి ఏర్పాటుకు వినియోగదారులు ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపుతున్నారు.



- మండలంలో 446 మంది 'సూర్యఘర్'కు దరఖాస్తు
- ఇప్పటికే 38 ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు
- రాయితీ, స్వల్ప వడ్డీ రుణాలతో ఏర్పాటుకు ఆసక్తి



సోలార్ మిగులు విద్యుత్‌ను నమోదు చేసే మీటరు

'సూర్యఘర్' దరఖాస్తుల తీరు

గ్రామ పంచాయతీలు	వచ్చిన దరఖాస్తులు	యూనిట్లు అమర్చినవి	ఏర్పాటు దశలో ఉన్నవి
14	446	38	12

పరవాడ: విద్యుత్ వినియోగదారులు తమ కరెంట్ బిల్లులను ఆదా చేసుకునేందుకు సౌర విద్యుత్‌పై దృష్టి సారిస్తున్నారు. నానాటికీ పెరిగిపోతున్న విద్యుత్ వినియోగాన్ని పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా సమకూర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. దీనికి ఈపీడీసీఎల్ అధికారులు విస్తృత ప్రచారం, అవగాహన కల్పిస్తుండటతో గృహ వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ రాయితీ, బ్యాంకుల స్వల్ప వడ్డీ ప్రయోజనాలతో సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

'సూర్యఘర్'కు 446 దరఖాస్తులు

సోలార్ యూనిట్ల ఏర్పాటుకు పరవాడ మండలంలో ఆదరణ పెరుగుతోంది. 14 గ్రామ పంచాయతీల నుంచి ఇప్పటి వరకు 446 మంది వినియోగదారులు దరఖాస్తులు చేశారు. పలు గ్రామాల్లోని 38 మంది వినియోగదారుల ఇంటి పైకప్పులపై సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసి, విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. మరో 12 మంది దరఖాస్తుదారుల ఇంటిపై కనెక్షన్‌లు ఏర్పాటు దశలో ఉన్నాయి. మండలంలో గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, పరవాడ గ్రామాల నుంచి ఎక్కువ మంది వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్‌లకు దరఖాస్తులు చేసుకున్నారు.

సోలార్ రూఫ్‌టాప్ రాయితీ

లోడ్	ఉత్పత్తి	వ్యయం	రాయితీ
1 కిలోవాట్	120 యూనిట్లు	రూ.70 వేలు	రూ.30 వేలు
2 కిలోవాట్లు	240 యూనిట్లు	రూ.1.40 లక్షలు	రూ.60 వేలు
3 కిలోవాట్లు	360 యూనిట్లు	రూ.2.10 లక్షలు	రూ.78 వేలు

సోలార్ రూఫ్ టాప్‌తో ఆదా


యూనిట్లు	ప్రస్తుత బిల్లు	'సౌర'బిల్లు
120	రూ.1,000	రూ.338
240	రూ.2,000	రూ.333
360	రూ.3,000	రూ.298



సోలార్ విద్యుత్ యూనిట్లను తెలిపే మీటరు

చాలా మంచి పథకం

పీఎం సూర్యఘర్ యోజన పథకంలో 3 కిలోవాట్స్ సోలా ర్ రూఫ్‌టాప్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాను. విద్యు త్ బిల్లు చాలా వరకు ఆదా అయింది. రూ.2 లక్షలు బ్యాంకు రుణం మంజూరు చేసింది. ప్రభుత్వం రూ.78 వేలు రాయితీ అందించింది. ఇది చాలా మంచి పథకం. అనువైన స్థలం ఉన్న ప్రతి ఒక్కరూ సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.



–కూండ్రపు యమహా నాయుడు, నాయుడుపాలెం

సద్వినియోగం చేసుకోవాలి



సూర్యఘర్ యోజన పథకాన్ని గృహ విద్యుత్ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలి. పథకం ఏర్పాటుకు బ్యాంకులు 7 శాతం వడ్డీపై రుణ సదుపాయం కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. పీఎం సూర్యఘర్ పథకం పొందేందుకు వెబ్‌సైట్/సమీపంలోని ఈపీడీసీఎల్ కార్యాలయం/టోల్ ఫ్రీ నెం.1912ను సంప్రదించవచ్చు.

–ఎస్.రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏపీఈపీడీసీఎల్, పరవాడ

దరఖాస్తు చేసుకోవడమిలా..

- పీఎం సూర్యఘర్(https://pmsuryaghar.gov.in/) పోర్టల్‌లో రాష్ట్రం, విద్యుత్ సరఫరా సంస్థ(ఈపీడీసీఎల్)ను సెలక్ట్ చేసి, విద్యుత్ కనెక్షన్(కన్జ్యూమర్) నంబర్, మొబైల్ నంబర్, ఈ–మెయిల్‌ను ఎంటర్ చేసి నమోదవ్వాలి.
- కన్జ్యూమర్ నంబర్, మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.
- విద్యుత్ శాఖ నుంచి అనుమతులు వచ్చాక, **వారు ప్రతిపాదించి**న సంస్థల సోలార్ **యూనిట్‌ను మాత్ర**మే ఏర్పాటుచేయాలి.
- **సోలార్ యూనిట్** వివరాలను వెబ్ **పోర్టల్‌లో నమోదు** చేసి, నెట్ మీటర్ **కోసం దరఖాస్తు చే**సుకోవాలి.
- **నెట్ మీటర్ బిగించా**క విద్యుత్ అధికారులు **ఇంటి వద్దకు వచ్చి** తనిఖీలు చేసి, పోర్టల్ **నుంచి కమిషనింగ్** సర్టిఫికెట్ మంజూరు **చేస్తారు.**
- **ఈ సర్టిఫికెట్ వ**చ్చాక బ్యాంకు ఖాతా, **క్యాన్సిల్డ్ చెక్ తది**తర వివరాలను పోర్ట**ల్‌లో నమోదు చేస్తే**, నెల రోజుల్లో సబ్సిడీ **మొత్తం వినియో**గదారు బ్యాంకు ఖాతాలో **జమచేస్తారు.**

డబ్బు ఆదా అవుతుంది



ఇటీవలే మా ఇంటికి సూర్యఘర్ పథకంలో సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకున్నాను. గతంలో రెండు విద్యుత్ మీటర్లపై నెలకు రూ.2,500 వరకు బిల్లు వచ్చేది. సోలార్ యూనిట్ ఏర్పాటు చేసిన తరువాత నెలకు రూ.300 బిల్లు చెల్లిస్తున్నాను. రూ.2,200 వరకు ఆదా అవుతోంది. సోలార్ బిల్లులో ఎఫ్‌టీసీ చార్జీలు తగ్గిస్తే మరింతగా ఆదా అవుతుంది.

–బండారు రాజు, వినియోగదారుడు, పరవాడ

పుచ్చలపల్లి మార్గం అనుసరణీయం



జ్యోతినగర్‌లో పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



సబ్బవరం సిటు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఠా కార్మికులు



పరవాడలో పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెందుర్తి: స్వాతంత్య్ర సమరయోధుడు, కమ్యూనిస్ట్ ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఘన నివాళులర్పించారు. జీవీఎంసీ 95వ వార్డు జ్యోతినగర్‌లో పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఐద్వా సీనియర్ నాయకురాలు బి.అనంతలక్ష్మి మాట్లాడుతూ పుచ్చలపల్లి జీవితాంతం పేద ప్రజల అభ్యున్నతి కోసమే పోరాటం చేశారన్నారు. నిరాడంబరంగా సాగిన పుచ్చలపల్లి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. తన ఆస్తిని పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి అని కొనియాడారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా పరవాడ ఊర చెరువు వద్ద ఉపాధి కూలీలతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, స్వతంత్ర భారత పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నాయకుడిగా, కష్ట జీవుల కోసం నిరంతరం పోరాడి తన జీవితాన్నే అంకితం చేసిన కమ్యూనిస్టు గాంధీగా గుర్తింపు పొందరన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఆయన చూపిన మార్గంలో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, రమణమ్మ, పార్వతి, లక్ష్మి పాల్గొన్నారు.

సబ్బవరం: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక సిటు కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిటు జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పాడ సత్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఠా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా ఆయన అందించిన సేవల్ని కొనియాడారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు పుచ్చలపల్లి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బర్ల రమణ, బంగారినాయుడు పాల్గొన్నారు.

రేపు పంచముఖ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట



విఘ్నేశ్వర పూజలో మెట్రోకెమ్ వ్యవస్థాపకుడు నందెపు వెంకటేశ్వరరావు దంపతులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని మెట్రోకెమ్ పరిశ్రమ ఆవరణలో యాజమాన్యం సౌజన్యంతో ఈ నెల 21న పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట చేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ వ్యవస్థాపకుడు నందెపు వెంకటేశ్వరరావు దంపతులు సోమవారం విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. వేద పండితులు ఇరగవరపు వెంకటశ్రీధర్ స్వామి నేతృత్వంలో శనివారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మూలమంత్ర హవనం, చతుర్వేద హవనం, సూర్య నమస్కారం, జలాధివాసం, సోమవారం మన్యు సూక్త హవనం తదితర పూజలు జరిపారు. మంగళవారం సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బుధవారం ప్రాతఃకాల పూజలు నిర్వహించి ఉదయం 8.51 గంటలకు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు



సినిమాహాలు కూడలిలో పంచముఖాంజనేయ



సబ్‌స్టేషన్ కూడలిలోని ఆంజనేయస్వామి

పరవాడ: స్థానిక సినిమాహాలు కూడలిలో పైడిమాంబ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 22న హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పైడిమాంబ యూత్ ప్రతినిధులు తెలిపారు. సినిమాహాలు కూడలిలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం జరపుతామన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి పంచముఖ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

- పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ కూడలిలో కొలువైన ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధనకు భక్తులు హాజరై, అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

ఘనంగా అభయ వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం



అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతున్న భక్తులు



అభయ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పరవాడ: ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ.బోనంగిలో కొలువైన భూసమేత అభయ వేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలను సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తమ్మిరెడ్డి సతీష్ ఆర్థిక సాయంతో లక్ష్మీదేవి, గోదాదేవి, ద్వారపాలకుల విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు హరికృష్ణ ఆచార్యులు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు కరగాని సూర్యనారాయణ దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావు, లాలం అప్పలనాయుడు, మేడిశెట్టి బాలాజీనాయుడు, గొర్లి శ్రీనివాస్, సత్యనారాయణ, ధనరాజు, లోవరాజు, శేఖర్ దీపిక దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ వద్ద కాంట్రాక్ట్ వర్కర్ల ఆందోళన



ఎన్టీపీసీ మెయిన్‌గేట్ వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో పోలీస్ వెరిఫికేషన్ పేరుతో కాంట్రాక్టు కార్మికులను వేధించడం తగదని ఎన్టీపీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ మెయిన్ గేట్ వద్ద సోమవారం కాంట్రాక్టు కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల నుంచి క్యారెక్టర్ సర్టిఫికెట్ తీసుకురావాలని యాజమాన్యం ఒత్తిడి చేయడం అన్యాయమన్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం మార్వాడీ కంపెనీ కంటే ఘోరంగా తయారయిందని ఆక్షేపించారు. ఎన్టీపీసీలో ఇప్పటి వరకు వైద్య పరీక్షల పేరుతో కార్మికులను వేధించేవారని, ఇది కొనసాగుతుండగానే మళ్లీ పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ల కోసం వేధిస్తుండడం అన్యాయమన్నారు. 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులకు ఇప్పుడు పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ నిబంధన పెట్టడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి.పి.నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గోవిందరాజు, రమణ, శ్రీను, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబూ.. సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు?

- నిరుపేదలకు ఇంటి స్థలాలు వెంటనే మంజూరు చేయాలి
- సీపీఐ ఆధ్వర్యంలో పెందుర్తి రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా



రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, ప్రజలు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఎప్పుడు అమలు చేస్తారని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఆర్ శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఎన్నికల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేసి, ఆ ఫలాలను అర్హులైన పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను, పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇంటి స్థలాలను తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేస్తూ స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క హామీనీ అమలు చేయక పోవడం దారుణమన్నారు. సూపర్ సిక్స్ హామీలను పారదర్శకంగా అమలు చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, ప్రతినిధులు అసిరినాయుడు, రాము, రమణ, అరుణ, రజని, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



మల్లునాయుడుపాలెంలో రైతులతో కలిసి అవగాహన ర్యాలీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సబ్బవరం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించడం ద్వారా లాభసాటి పంటలను పండించడమే కాకుండా ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ సీహెచ్ సత్యవతి తెలిపారు. మండలంలోని మల్లునాయుడుపాలెం సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ బోను దేవుడమ్మ ఆధ్వర్యంలో ప్రకృతి సేద్యంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో చేయబోయే సర్వే చాంపియన్, ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ మాన్‌సూన్ డ్రైసోయింగ్‌లో భాగంగా ఎకరాకు సరిపడా రూ.1250 విలువైన 30 రకాల విత్తనాలతో కూడిన 12 కిలోల కిట్‌ను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గుంటలలో ఎకరాకు రెండు కిలోల చొప్పున విత్తనాలు వేసుకోవడం ద్వారా నేలలో కర్బన శాతం పెరుగుతుందన్నారు. దీంతో పోషకాలు, జీవ వైవిధ్యం, నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, ప్రధాన పంటలో దిగుబడి మెరుగ్గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ త్రిమూర్తులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమలత, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ నేర్చుకుందాం రండి..



వేసవి శిక్షణ శిబిరంలో డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం కథలు చదవడం, రాయడం, చెప్పడం, డ్యాన్స్ తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జానకిరామ్ చిన్నారులకు నీతి కథను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఇంగ్లిష్, నాట్య గురువు ప్రసన్న విద్యార్థులకు సంప్రదాయ నృత్యాలు నేర్పించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.